క్లుప్తంగా

వేగంగా పైప్‌లైన్ పనులు



ఇబ్రహీంపట్నం: కొండపల్లి పరిధిలోని పుట్లమ్మ గట్టు, ఏపీహెచ్ఎంఈఎల్ రోడ్డు, శాలివాహన నగర్‌లో తాగునీటి కోసం జిల్లా మినరల్ ఫండ్ రూ.40 లక్షలతో ఏర్పాటు చేస్తున్న నూతన పైప్‌లైన్ పనులను కొండపల్లి మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ మౌస్మి, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. నీటి సరఫరాకు ఎటువంటి సమస్య తలెత్తకుండా పైప్‌లైన్ ఏర్పాటు జరగాలని అధికారులకు కమిషనర్ సూచించారు.

డీఎల్‌డీఓ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

నూజివీడు: పట్టణంలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీఎల్‌డీఓ) కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణకు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న బుధవారం స్థల పరిశీలన చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణను, మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న జెడ్పీ గెస్ట్ హౌస్ స్థలాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించారు.ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, డీఎల్‌డీఓ కె.వెంకటరత్నం పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



ఇబ్రహీంపట్నం: సీపీఎం జాతీయ నాయకుడు సీతారాం ఏచూరి ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని సీపీఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి ఎం. మహేష్ అన్నారు. సీతారాం ఏచూరి వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో కొండపల్లి బ్యాంకు సెంటర్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటాలను నాయకులు కొనియాడారు.

మండలాభివృద్ధికి కృషి

నూజివీడు: మండలంలోని గ్రామాలన్నీ అభివృద్ధి చెందితేనే మండలం అభివృద్ధి చెందుతుందని, ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో మండల పురోగతి సూచికపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులకు బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష, ఏఎస్‌డబ్ల్యూఓ డి. శ్రీనివాసరావు, ఎంఈఓ జమలయ్య పాల్గొన్నారు.

బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగపవన్

ఇబ్రహీంపట్నం: బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నానికి చెందిన వల్లభనేని నాగపవన్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంతి నాగరాజు బుధవారం నియామక పత్రం అందజేశారు. బీసీ వర్గాల అభ్యున్నతి, ప్రజాసేవ పట్ల అంకితభావం, నాయకత్వ లక్షణాలు, సామాజిక స్పృహ కలిగిన నేతగా గుర్తించి కీలక బాధ్యత అప్పగించినట్లు నాగరాజు పేర్కొన్నారు. నాగ పవన్ కుమార్ మాట్లాడుతూ బీసీ వర్గాల హక్కుల సాధనకు కృషి చేస్తానన్నారు. నాగ పవన్ కుమార్‌ను పలువురు అభినందించారు.

ఆలయ హుండీ కానుకల చోరీ కేసులో నిందితులకు జైలు

తిరువూరు: మండలంలోని మునుకుళ్ల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ చోరీ చేసిన నిందితులకు తిరువూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు బుధవారం జైలు శిక్ష విధించింది. సెక్టార్-1 ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. 2024 ఏప్రిల్ 10న తెలంగాణ రాష్ట్రంలోని సత్తుపల్లి మండలం లంకపల్లికి చెందిన మానికల వసంతరావు, పొన్నూరు రాంబాబు, మానికల నగేష్, మానికల సురేష్‌లు మునుకుళ్ల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ పగులగొట్టి నగదు అపహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ వెదురు రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ అనూష విచారణ అనంతరం నిందితుడు మానికల వసంతరావుకు 17 నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మిగిలిన ముగ్గురు నిందితులకు 9 నెలల చొప్పున కఠిన కారాగార శిక్ష విధించారు.

ఎస్ఓఎస్ బాక్సులపై అవగాహన

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ఎస్ఓఎస్ బాక్సులపై ఆ పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా బుధవారం అవగాహన కల్పించారు. కాచవరం పాఠశాల సమీపంలోని ఎస్ఓఎస్ (సేవ్ అవర్ సోల్) బాక్సులు జాతీయ రహదారులపై ప్రతి 300 మీటర్లకు ఒకటి ఉంటుందని చెప్పారు. మన ప్రయాణాల్లో అనుకోని రీతిలో ప్రమాదాలు జరిగితే ఎస్ఓఎస్ బాక్సుపైన ఉన్న బటన్ లాంగ్ ప్రెష్ చేసి ప్రమాదం జరిగినట్లు వాయిస్ ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు.

నిత్యం లీకులు.. నీటికి ఇబ్బందులు

- కృష్ణా వాటర్ పైపులైనుకు అడుగడుగునా లీకులు
- వృథాగా పోతున్న లక్షల లీటర్ల తాగు నీరు
- మరమ్మతుల కోసం తవ్విన గుంతలతో నీరు కలుషితం
- పైపులైను ఏర్పాటుకు నిధులివ్వని ప్రభుత్వం



గడ్డమణుగు గ్రామ శివారులో కృష్ణా వాటర్ పైపులైను పగిలి లీకైన తాగునీరు



జి.కొండూరులో మరమ్మతుల కోసం తవ్విన గుంత

జి.కొండూరు: జి.కొండూరు మండల పరిధిలో కృష్ణా వాటర్ పైపులైనును దశాబ్దాల కిందట ఏర్పాటు చేశారు. పైప్‌లైను తుప్పు పట్టి అడుగడుగునా లీకులు ఏర్పడుతున్నాయి. కలుషిత నీరు సరఫరా అవడంతో ప్రజలు వ్యాధుల భారిన పడుతున్నారు.

రోజుకు యాభై లక్షల లీటర్ల సరఫరా

జి.కొండూరు మండల పరిధిలో 22 గ్రామ పంచాయతీల్లో 15,105 కుటుంబాల వారు నివశిస్తున్నారు. మండల పరిధిలోని చిన్న నందిగామ, కోడూరు, భీమవరప్పాడు గ్రామాలు మినహా అన్ని గ్రామాలకు కృష్ణా వాటర్ పైపులైను ద్వారా ప్రతి రోజూ 50 లక్షల లీటర్ల తాగునీరు సరఫరా అవుతోంది. ఈ పైపులైను మొత్తం అడుగడుగునా లీకులు ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. పైపులైను మరమ్మతుల కోసం తవ్విన గుంతలను మరమ్మతుల అనంతరం చెకింగ్ పేరుతో రోజుల తరబడి పూడ్చకుండా ఉంచడంతో లీకైన నీరు మరలా పైపుల్లోకి చేరి తాగునీరు కలుషిమై ప్రజలు వ్యాధుల భారిన పడుతున్నారు.

పైపులైను ఇలా..

జి.కొండూరు నుంచి గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని గ్రామాలను కలుపుతూ దుగ్గిరాలపాడు వరకు 13.9 కిలోమీటర్ల మేర పైపులైను ఉంది. జి.కొండూరు నుంచి చెవుటూరు వరకు 3.8 కిలో మీటర్లు, జి.కొండూరు నుంచి ఆత్కూరు, హెచ్.ముత్యాలంపాడు, కందులపాడు, చేగిరెడ్డిపాడు గ్రామాల మీదుగా వెల్లటూరు వరకు 8 కిలోమీటర్లు, కందులపాడు నుంచి వెలగలేరు వరకు 3 కిలోమీటర్ల మేర పైపులైను ఉంది. కొండపల్లి శాంతినగర్ నుంచి కవులూరు గ్రామం వరకు 3 కిలోమీటర్లు, మైలవరానికి వెళ్లే మెయిన్ లైను నుంచి కుంటముక్కల వరకు 2 కిలోమీటర్లు, గుర్రాజుపాలెం గ్రామం వరకు 2 కిలోమీటర్ల మేర పైపులైను విస్తరించి ఉంది. ఈ పైపులైను నిత్యం పగిలి లీకులు ఏర్పడుతున్నాయి.

నిధులు విడుదల చేయకపోవడమే సమస్య..

జి.కొండూరు నుంచి దుగ్గిరాలపాడు వరకు 13.9 కిలోమీటర్ల మేర కృష్ణా వాటర్ పైపులైను ఉంది. ఈ గ్రామాలకు ప్రతి రోజూ 4 లక్షల లీటర్ల వరకు తాగునీరు సరఫరా అవుతోంది. ఈ పైపులైను దశాబ్దాల కిందట ఏర్పాటు చేసింది కావడంతో నీటి సరఫరాకు సమస్య తలెత్తుతోంది. జి.కొండూరు నుంచి గంగినేని వరకు రహదారి విస్తరణ పనులు కూడా జరుగుతున్న క్రమంలో నూతన పైపులైను ఏర్పాటుకు అధికారులు రూ.3.30 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపారు. పైపులైను ఏర్పాటుకు నిధులు విడుదల కాకపోవడంతో పైపులైను ఏర్పాటు ఆగిపోయింది. ఈ క్రమంలో ప్రధాన పైపులైను అస్తమానం పగిలిపోయి మరమ్మతులు చేస్తుండడంతో నీటి సరఫరాలో జాప్యం జరుగుతోంది. లీకుల వల్ల నిత్యం తాగునీరు కలుషితమై ఆయా గ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నారు.



జి.కొండూరు పులివాగు వద్ద పైపులైను పగిలి లీకైన తాగునీరు

కలుషిత నీరు సరఫరా



కృష్ణా వాటర్ లీకుల వల్ల రంగుమారి వస్తుంది. నిత్యం పైపులు పగిలిపోయి నీటి సరఫరా ఆగిపోతోంది. రోజుల తరబడి తాగునీరు రావడం లేదు. రంగుమారిన నీరు తాగాలంటే భయమేస్తోంది. కొత్త పైపులైను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలి.

– రమావతు శ్రీను, గ్రామస్తుడు, మునగపాడు

పైపులైను అంతా లీకులే



జి.కొండూరు నుంచి మునగపాడు వైపు వచ్చే కృష్ణా వాటర్ పైపులైనుకు అడుగడుగునా లీకులు ఉన్నాయి. ఎప్పుడూ గుంతలు తవ్వి బాగు చేస్తూనే ఉంటారు. తాగునీరు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు రాదో తెలియదు. ప్రభుత్వం వెంటనే నూతన పైపులైను ఏర్పాటు చేయాలి.

– ఎస్ రాజశేఖరరెడ్డి, గ్రామస్తుడు, మునగపాడు

కొత్త పైపులైను ఏర్పాటు చేయాలి



ఇప్పుడున్న పైపులైను పగిలిపోయి నీరు వృథాగా పోతోంది. నీరు సక్రమంగా రాక తాగునీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. ఒకవేళ వచ్చినా నీరు కలుషిత నీరు వస్తోంది. కొత్త పైపులైను వెంటనే ఏర్పాటు చేయాలి.

– కామెళ్ల శశికుమార్, గ్రామస్తుడు, మునగపాడు

విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం

జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా



తిరువూరు: ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థుల అవసరాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ఉపాధ్యాయులకు సూచించారు. ఎ.కొండూరులోని కస్తూరిబా బాలికా విద్యాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు నిర్వహించడంతో పాటు తరచూ ఆరోగ్య పరీక్షలు జరపాలన్నారు. పాఠశాలలో తాగునీటి సరఫరా చేసే ఆర్వో ప్లాంట్లు, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచాలని, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. పాఠశాల నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని, విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. పాఠశాల భవనాల మరమ్మతుకు తగు ప్రతిపాదనలు వెంటనే పంపాలని చెప్పారు. తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. మాధురి, ఎ.కొండూరు తహసీల్దార్ కె. లక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ కేశవరావు, కేజీబీవీ ప్రత్యేకాధికారి శ్యామల పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో విజ్ఞానం పెంపు

మైలవరం: క్షేత్రస్థాయి పర్యటనలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ విద్యార్థుల క్షేత్ర స్థాయి పర్యటనను బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రారంభించి మాట్లాడారు. విజయవాడ బాపూ మ్యూజియంలోని ప్రాచీన, మధ్య, నవీన రాతియుగంలో వాడిన పురాతన వస్తువులు, వివిధ రకాలుగా తయారు చేసిన విగ్రహాలు భారతీయ సాంస్కృతిక వైభవానికి నిదర్శనమన్నారు. చరిత్ర అధ్యాపకులు డి. శ్రీనివాసరావు మ్యూజియం ప్రాముఖ్యతను, పరికరాలు, వస్తువులను విద్యార్థులకు వివరించారు.

‘నమస్తే’ పథకంతో చెత్త సేకరించే కార్మికులకు సంక్షేమం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మనోజ

తిరువూరు: రోడ్ల వెంబడి చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకునే కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ‘నమస్తే’ పథకాన్ని ప్రవేశపెట్టిందని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ మనోజ తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో ఈ పథకంపై బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎటువంటి జీవనోపాధి, శాశ్వత ఆదాయ వనరులు లేని చెత్త సేకరించే కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాల మంజూరుకు, వారి కుటుంబాల్లో యజమాని మరణిస్తే రూ.5 లక్షల మేర ఆర్థిక సాయం అందించేందుకు ఈ పథకం ద్వారా అవకాశం ఉందని మనోజ వివరించారు. చెత్త సేకరించే కార్మికులు తమ ఆధార్ కార్డు, ఫొటోలను నగర పంచాయతీ కార్యాలయంలో అందజేస్తే వారికి నమస్తే పథకం వర్తింపజేస్తామన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ నిర్మల, వార్డు కౌన్సిలర్లు హుస్సేన్, సురేంద్ర, సత్యవతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని వినతి



ఏడీఏకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నూజివీడు: వ్యవసాయ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ అన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు అందించాలని కోరుతూ సీపీఐ నాయకులు బుధవారం ఏడీఏ జి.విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నూతన కౌలు చట్టం తెస్తామని ప్రభుత్వం ప్రకటించి నెలలు గడుస్తున్నా నేటికీ తీసుకురాకుండా కాలం గడుపుతోందని, దీంతో వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. పంట రుణాలు ఇవ్వకపోవడంతో పంటల సాగుకు కౌలు రైతులు వడ్డీ వ్యాపారస్తుల నుంచి అప్పులు చేసి పంటలను సాగు చేశారన్నారు. ఇప్పటికే రెండు వ్యవసాయ సీజన్ల నుంచి కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పెట్టుబడి సాయమైన అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు మడుపల్లి నాగేంద్రరావు, నాయకులు అరికోటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి మద్దిరాల



నాగరాజును సన్మానిస్తున్న తిరువూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

తిరువూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి మద్దిరాల నాగరాజు అన్నారు. బుధవారం పాఠశాలను సందర్శించిన ఆయన తాను ఈ స్కూల్లోనే విద్యనభ్యసించానని, రూ.25 లక్షలతో పాఠశాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి వెళ్లడమే లక్ష్యంగా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ ల్యాబ్, ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు నాగరాజు సహాయం అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు తెలిపారు. నాగరాజును ఉపాధ్యాయులు సన్మానించారు.

పంచాయతీల పురోగతికి కృషి

ఆగిరిపల్లి: పంచాయతీల పురోగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల పరిషత్ పరిపాలనాధికారి అబ్దుల్ సలాం అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పంచాయతీ రాజ్ పురోగతి సూచిక వెర్షన్ 2.0కు సంబంధించి ఎంపీటీసీలకు, సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ ఏఈ సుందర్ కుమార్, ఏపీఓ ఖాజావలి, ఈదర పంచాయతీ కార్యదర్శి నిషాక్ అలీ పాల్గొన్నారు.

- మునునూరు: పంచాయతీ పురోగతి సూచికపై ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు, సిబ్బందికి అవగాహన అత్యంత ఆవశ్యకమని ఎంపీడీఓ బీఏ సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ సంబంధిత ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు, సిబ్బందికి ఒక రోజు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి, ఇబ్రహీంపట్నం రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ మహేష్ ఆదేశాల మేరకు విజిలెన్స్ ఎస్ఐ కృష్ణసాయి నేతృత్వంలో రెండు టీములుగా విడిపోయి ఐదు దుకాణాల్లో దాడులు చేసి రికార్డులు తనిఖీ చేశారు. తనిఖీల్లో వివిధ రేషన్ షాపుల్లో తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

విశ్వనాథ సత్యనారాయణ జయంతి

తిరువూరు: జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ జయంతిని గంపలగూడెం మండలం పెనుగొలను షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై. శ్రీనివాసరావు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. షిర్డీ సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు నారాయణరావు మాట్లాడుతూ 25 కావ్యాలు, ఆరు శతకాలు, 13 గేయ కావ్యాలు, 15 నాటకాలు, 58 నవలలు, 10 సంస్కృత నాటకాలు, 10 విమర్శన గ్రంథాలు, మరెన్నో వ్యాసాలను విశ్వనాథ సత్యనారాయణ రాశారని చెప్పారు. రామాయణ కల్పవృక్షం, వేయి పడగలు, కిన్నెరసాని పాటలు, ఆంధ్ర పౌరుషం, పురాణ వైర గ్రంథమాల వంటి రచనలతో తెలుగు భాషకే ఆయన వన్నె తెచ్చారని కొనియాడారు.

అప్పారావుకు జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు

మైలవరం: జాతీయ స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు ఎంపికయ్యారు. నీతి అయోగ్ వారిచే గుర్తింపు పొందిన కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్స్ ఇండియా వారు ఈ నెల 5న హైదరాబాద్‌లో అప్పారావుకు అవార్డును ప్రదానం చేసి ప్రశంసాపత్రంతో సన్మానించారు. కళాశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావును అభినందించింది.

సోషల్ మీడియాలో పోస్టులపై ఫిర్యాదు

మైలవరం: రైతు సంఘం నాయకులు, సీపీఎం నాయకులపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను, సకాలంలో యూరియాను రైతులకు అందించడంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై రైతుసంఘం నాయకులు విమర్శించారు. దీనిపై సోషల్ మీడియాలో టీడీపీకి చెందిన కొందరు కమ్యూనిస్టు పార్టీలు అవినీతి పార్టీలని, సీపీఎం నాయకులు పనీపాట లేని నిరుద్యోగులనే వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో పోస్టులు ఫార్వర్డ్ చేశారన్నారు. దీనిని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఖండించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

దర్గాను సందర్శించిన నాగసాధువులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని హజరత్ సయ్యద్ షాబుఖారి దర్గాను గుజరాత్‌కు చెందిన నాగ సాధువులు కిశోర్, గిరి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైవ సంబంధిత, దర్గా విశిష్టతపై సమాలోచన జరిపారు. సర్వ మతాలకు నిలయంగా మారిన దర్గా వివరాలు నాగసాధువులకు వివరించారు. సర్వ మానవాళి శ్రేయస్సుకు బాబా వారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. శ్రీమద్విరాట్ విశ్వకర్మ ఆలయ ట్రస్టీ కత్తురోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఆగిరిపల్లి: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ-1 హేబేలు అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో వారధి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ఈదులగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎన్.కిక్, వి.కీర్తి, గగన ప్రథమ స్థానం సాధించారు. వక్తృత్వం పోటీల్లో ఎం.సురవరం విద్యార్థులు నమ్రత రోజ్, రమ్య, రాజేశ్వరి ప్రథమ స్థానం సాధించారు. విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ-2 ఆనంద్ కుమార్ తెలిపారు.

పోలీసుల అదుపులో పేలుడు ప్రధాన నిందితుడు

ఇబ్రహీంపట్నం:జూపూడి భీమేశ్వర కాలనీలో ఈనెల 2న జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ప్రధాన నిందితుడిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఇంటి యజమాని రెంటపల్లి కోటమ్మను రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకుని విచారించగా బాణాసంచా తయారీకి ఉపయోగించే మెటీరియల్ సరఫరా చేసి, తయారైన వాటిని తిరిగి తీసుకువెళ్లే తాడేపల్లి వ్యక్తి పేరు పోలీసులకు తెలిపినట్లు తెలిసింది. దీంతో అతనిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఏ1 ముద్దాయిగా ఉన్న ఇంటి యజమాని కోటమ్మను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. ఆమె కుమారుడు అవినాష్ ఇప్పటికే పరారీలో ఉన్నాడు. ప్రధాన ముద్దాయిని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తిరువూరులో భారీ వర్షం

జలమయమైన రహదారులు, బస్టాండ్



తిరువూరు లక్ష్మీగణపతి ఆలయ సమీపంలో మెయిన్‌రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

తిరువూరు: తిరువూరు పట్టణంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉరుములు, పిడుగులతో గంటసేపు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పట్టణంలోని మెయిన్‌రోడ్డు జలమయమై చెరువును తలపించింది. ఫ్యాక్టరీ సెంటర్ నుంచి బైపాస్ రోడ్డు లక్ష్మీగణపతి ఆలయం వరకు రోడ్డుపై వర్షం నీరు నిలవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. మెయిన్ రోడ్డులో ఇరువైపులా డ్రెయినేజీలు పూడుకుపోయి, నీరు పోయే మార్గం లేక లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది. ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజీ కూడా నీట మునిగాయి. బస్టాండ్ ప్లాట్‌ఫారాల వరకు నీరు రావడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.

స్కూల్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



స్కూల్ సమీపంలో నిర్మిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

జి.కొండూరు: చెవుటూరు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు పక్కనే నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు అధికారులు బుధవారం కాంక్రీటు దిమ్మె నిర్మాణ పనులు చేపట్టడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు పొరపాటున ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్తే ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున అభ్యంతరం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును నిలిపివేయాలని కోరుతూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు ఎ.రమాదేవి, కేఎస్‌జే లక్ష్మి స్థానిక విద్యుత్ శాఖ ఏఈ షఫీకి వినతిపత్రం అందజేశారు.